క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: ఆర్‌కేపురం ఆఫీసర్స్ కాలనీ 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సికింద్రాబాద్ ఏడీఈ మురళి కృష్ణ తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 గంటల నుండి 12.30 గంటల వరకు నేషనల్ సెక్యూరిటీ గార్డ్ హస్పిటల్, స్టేషన్ వర్క్‌షాపు, పరిసర ప్రాంతాలు. మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ఆశా ఆఫీసర్స్ కాలనీ, ఎస్‌వీ ఆఫీసర్స్ కాలనీ, గాంధీనగర్, హరిజన బస్తీ పరిసర ప్రాంతాల్లో పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.
రాంగోపాల్‌పేట్: క్లాక్‌టవర్, జేమ్స్ స్ట్రీట్ సబ్ స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 29వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు కళానికేతన్, కళాసీగూడ, ఎస్డీరోడ్, స్వప్నలోక్ కాంప్లెక్స్, మంజు థియేటర్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు చంద్రలోక్ కాంప్లెక్స్, ఓరియంటల్ బ్యాంక్, ఎమరాల్డ్ హౌజ్, నాన్‌కింగ్, భారత్ పెట్రోల్ బంకు ప్రాంతాల్లో చికోటి ఫీడర్ పరిధిలోని కండోజీబజార్, కళాసీగూడ, గాంధీ విగ్రహం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



అడ్డగుట్ట: ఆషాడమాసం మొదటి శనివారం సందర్భంగా తుకారాంగేట్‌లోని పహాడీ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆంజనేయస్వామి విగ్రహానికి అభిషేకాలు, సింధూరం, ఆకుపూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బస్తీలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

కంటోన్మెంట్: బస్తీలలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని బోర్డు సభ్యురాలు భానుక నర్మద అన్నారు. ఆరోవార్డు అంబేడ్కర్ నగర్‌లో రూ.12 లక్షల నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భానుక నర్మద మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా ఈ బస్తీ లో ఉన్నటువంటి డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించించనుందని అన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ నాయకుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: భారత రాజ్యాంగం పై ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఓయూలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు నిరసన తెలిపారు. శనివారం ప్లకార్డులను ప్రదర్శిస్తు రాజ్యాంగంలో ఉన్న సెక్యులరిజం, సోషలిజం పదాలను తొలగించాలని అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొమ్మనబోయిన సైదులు, ఎన్‌ఎస్‌యూఐ నేతలు వెంకట్ ముదిరాజ్, వికాస్‌యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు



విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలను సృష్టిస్తారని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెమ్స్ ఒలంపియడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ , సోషల్, గణితం పోటీలలో నిలిచిన విజేతలకు సెమ్స్ నేషనల్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం వారిలో ప్రతిభను వెలుగులోకి తెస్తుంది అన్నారు. సంస్థ అధ్యక్షులు రాఘవులు, ఏపీ రామచంద్ర రెడ్డి, సెమ్స్ డైరెక్టర్ జయప్రసాద్ పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం

- 30 నుంచి బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవాలు



రేణుకా ఎల్లమ్మ తల్లి



అమీర్‌పేట: అమ్మల గన్న అమ్మ బల్కంపేట శ్రీ రేణుకా ఎల్లమ్మ పోచమ్మ కల్యాణ మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆషాడ మాసంలో నిర్వహించే అమ్మవారి కల్యాణ వేడుకలు ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లను పూర్తి చేశారు. విద్యుత్తు దీపాలతో ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చి దిద్దారు. లక్షలాదిగా తరలి వచ్చే భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకుని వెళ్లేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను పెంచినట్లు ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపారు.

3 పట్టు చీరలతో అమ్మవారి అలంకరణ

వేడుకల సందర్భంగా చేనేత కళాకారులు తయారు చేసిన మూడు పట్టు చీరలతో ఎల్లమ్మను ప్రత్యేకంగా ముస్తాబు చేయనున్నారు. ఒక్కో చీరనేయడానికి మూడు రోజుల సమయం పట్టిందని పద్మశాలి సంఘం ప్రతినిధులు తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా ఆలయం ప్రాంగణంలోనే తయారు చేస్తారు.

గణనీయంగా పెరిగిన భక్తుల రద్దీ

2001–10 మధ్య కాలంలో అమ్మవారి కల్యాణం ఆలయ ప్రాంగణలోనే నిర్వహించే వారు.భక్తులు వందల సంఖ్యలో వచ్చే వారు.రాను రాను భక్తుల రద్దీ గణనీయంగా పెరుగుతూ వస్తోంది. రిలయన్స్ సంస్థ అధినేత ముఖేష్ అంబాని సతీమణి ప్రతి యేట అమ్మవారిని దర్శంచుకునేందుకువస్తారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయం ఎదురుగా ప్రధాన రహదారిపై కల్యాణ వేదికను ఏర్పాటు చేసి అమ్మవారి కల్యాణం జరిపించే వారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డ తర్వాత దాతల సహకారంతో రూ.ఒక కోటికి పైగా నిధులతో శాశ్వత షెడ్డును నిర్మించారు. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య రథోత్సవ వాహనాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి ఇచ్చారు.

ఇళ్ల విషయంపై ఆందోళన వద్దు

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ రామస్వామి కంపౌండ్, బర్కల్‌బస్తీ ప్రజలు ఇండ్ల విషయంలో ఎలాంటి భయాందోళనకు గురికావద్దని మీకు అన్ని విధాలా నేను అండగా ఉంటానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్థానికులకు భరోసా ఇచ్చారు. శనివారం రామస్వామి కంపౌండ్, బర్కల్‌బస్తీలను సందర్శించారు. ఇండ్ల విషయంలో రెవెన్యూ అధికారులు వచ్చి సర్వే చేయడంతో స్థానికులు ఆందోళనకు గురై ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను తమ ఆవేదనను వెలిబుచ్చారు. దీంతో శనివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి ఇరు బస్తీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఎండ్ల తరబడి నుంచి ఇక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మిమ్మల్నీ ఎవరూ ఖాళీ చేయించలేరని ధైర్యంగా ఉండాలన్నారు. మీ ఇండ్లకు తాను అన్ని విధాలా అండగా ఉంటూ కాపాడుకుంటానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత, ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, జలమండలి డీజీఎం ఆశీష్, డివిజన్ అధ్యక్షులు వెంకటేషన్‌రాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



కార్ఖానలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తూ నిధులు విడుదల చేస్తుండడంతో కంటోన్మెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. కార్ఖానా బడీ మసీదు సమీపంలో నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి నిధులు 56 లక్షల రూపాయలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను శనివారం బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదతో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. నిధులు సకాలంలో విడుదల అవుతున్నందున ప్రజలకు అసౌకర్యం కలగకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టీపీసీసీ కార్యదర్శి రాజేష్ యాదవ్, వివేక్ చింటూ పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా జరిగిన 11వ తెలంగాణ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి అడిషనల్ డీసీపీ, బ్యాట్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్ రావు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. నేషనల్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ సహకారంతో ముమ్ముందు కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని ఆయన సూచించారు. అనంతరం, వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు



బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ విజేతలతో ప్రముఖులు

బహుమతులు ప్రదానం చేశారు. అసోసియేషన్ కోశాధికారి, కోచ్ హర్ష, ఆర్‌ఆర్‌డీబీఏ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

అమ్మవారి ఘటానికి ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు

బన్సీలాల్‌పేట్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సికింద్రాబాద్ మహాకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం అమ్మవారి ఘటానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకుడు, తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దేశపాక శ్రీనివాస్ చెప్పారు. ఈ నెల 29 ఆదివారం రాణిగంజ్ చౌరస్తాలో పెద్ద ఎత్తున స్వాగత వేదికను ఏర్పాటు చేసి అమ్మవారి ఘటానికి ఘన స్వాగతం పలుకనున్నట్లు పేర్కొన్నారు. ఆటపాటలతో అత్యంత వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేశపాక శ్రీనివాస్ తెలియజేశారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి



ఎల్‌వోసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. శనివారం వెస్ట్‌మారేడుపల్లిలోని ఆయన నివాసంలో సనత్‌నగర్ ఎస్‌ఆర్‌టీకి చెందిన ప్రసాద్ గుప్తాకు రూ.1.10లక్షలు, జిలానీబేగంకు లక్ష రూపాయల చొప్పును మంజూరైన ఆర్థిక సహాయం పత్రాలను (ఎల్‌వోసీ) ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొలన్ బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పుస్తకం రచించిన 11 ఏళ్ల చిన్నారి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: 11 ఏళ్ల చిన్నారి సింహాద్రి ఆయుషి రచించిన ఫైనీ ఏ ట్రూ ఆంగ్ల నవలతోపాటు చిన్నారి అమ్మ సింహాద్రి నాగశిరిష రచించిన అమ్మ మాట, విరజల్లు, టింకూ..ద చిట్టెలుక పుస్తకాలను శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయుషి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ... అతి చిన్న వయస్సులో ఇంత మంచి పుస్తకం రాయడం అభినందనీయం అని చిన్నారి ఆయుషి ప్రతిభకు ఇదోక నిదర్శనం అన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

రసూల్‌పురా: రసూల్‌పురాలోని శ్రీదేవి నల్లపోచమ్మ ఆలయ కుంభాబిషేక మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రఘురామన్, అధ్యక్షుడు ఎం. శ్యామ్, కమిటీ సభ్యులు సుదర్శన్, శ్రీహరి, నరేందర్, గోపాల్, శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత కచేరి

నల్లకుంట: శ్రీరామగాన సభ ఆధ్వర్యంలో వాగ్గేయకార ఆరాధన సంగీతోత్సవాలు సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. శనివారం సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసురాలు మంగళంపల్లి స్వర్ణ, భమిడిపాటి లలిత నిర్వహించిన గాత్ర కచేరి అలరించింది. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు జి.నాగరాజన్, ఉపాధ్యక్షులు కేవీ. తిరుమల రావు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయండి



జీహెచ్‌ఎంసీ ఏఈ తివారికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

అడ్డగుట్ట: డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీజేపీ నాయకులు కోరారు. శనివారం బిజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ నేతృత్వంలో పార్టీ నేతలు వెళ్లి వార్డు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఏఈ తివారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ భవన్ మరమ్మతు పనులను వీలైనంత తొందరగా పూర్తి చేయాలన్నారు. అదే విధంగా రెండేళ్లుగా నిలిచిపోయిన అడ్డగుట్ట మల్టీపర్పస్ హాల్ పనులు తిరిగి ప్రారంభించాలన్నారు. సి–సెక్షన్ నుండి పహాడీ హనుమాన్ ఆలయం వరకు నూతన రోడ్డు పనులు, బోనాల పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో రోడ్లకు ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేయాలని కోరారు.

పకడ్బందీగా బోనాల ఏర్పాట్లు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న శైలజ రామయ్యర్

రాంగోపాల్‌పేట్: లక్షలాది మంది భక్తులు పాల్గొనే సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ అధికారులకు సూచించారు. శనివారం సాయంత్రం ఆమె దేవాలయ ఆవరణలో కమిషనర్ వెంకట్రావ్, నగర పోలీసు అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తదితరులతో ఆమె బోనాల జాతర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ శాఖల వారిగా చేపట్టే ఏర్పాట్లలో సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. వీఐపీలు, వీవీఐపీలు కూడా వస్తారని ప్రోటోకాల్ విషయంలో కూడా సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌తో అనుబంధం విడదీయరానిది

- దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్

చిలకలగూడ: సికింద్రాబాద్‌తో విడదీయరాని అనుబంధం ఏర్పడిందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ అన్నారు. రైల్వే ఆఫీసర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మెట్టుగూడ ఆఫీసర్స్‌క్లబ్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్న జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌ను పూలమాలలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జోన్ పరిధిలో ఎనిమిదేళ్ల పాటు వివిధ హోదాల్లో విధులు నిర్వహించానని, తాను పుట్టి పెరిగిన సెంట్రల్ రైల్వే జోన్ కంటే సౌత్ రైల్వే జోన్ సికింద్రాబాద్ తోనే ఎక్కువ అనుబంధం ఉందన్నారు. ఉద్యోగులు, సిబ్బంది, కార్మికుల సమిష్టి



ఎస్సీ రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కృషితో ఎస్‌సీ రైల్వే జోన్‌ను అన్ని రంగాల్లోను అగ్రగామిగా నిలిపి, జాతీయస్థాయిలో అనేక అవార్డులు పొందామన్నారు. కార్యక్రమంలో రైల్వే ఆఫీసర్స్ అసోషియేషన్ ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కంటోన్మెంట్: శ్రీగణేశ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ మారేడుపల్లి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం బోయిన్‌పల్లిలో నిర్వహించే ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఈ మేరకు శనివారం లయన్స్ క్లబ్ నిర్వాహకులకు రూ.2 లక్షల విరాళం అందజేశారు. బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్ వాలీబాల్ గ్రౌండ్‌లో నిర్వహించే వైద్య శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి ఉచిత పరీక్షలు, మందుల పంపిణీతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు సైతం చేయించాల్సిందిగా ఎమ్మెల్యే సూచించారు. పేదలకు ఉచితంగా చికిత్స అందించడానికి శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



లయన్స్ క్లబ్ నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

యార్డులో సదుపాయాలు మెరుగుపర్చండి



మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

- డైరెక్టర్‌కు మార్కెట్ కమిటీ సభ్యుల వినతి

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని కమిటీ సభ్యులు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేంద్ర మోహన్‌కు విన్నవవించారు. శనివారం బోయిన్‌పల్లి మార్కెట్ ఆవరణలోని నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు ఆధ్వర్యంలో సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో దుకాణాలకు తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. పురాతన డ్రైనేజీ లైన్‌లను ఆధునీకరించడంతో పాటు అంతర్గత రోడ్లను పునరుద్ధరించాలని కోరారు. త్వరలోనే ఆయా సమస్యల పరిష్కారానికి పాలనా అనుమతులు జారీ చేస్తామని చెప్పారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ డీబీ దేవేందర్, సెక్రెటరీ వెంకన్న ఇతర సభ్యులు ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: జులై 3, 4 తేదీలలో నిర్వహించ తలపెట్టిన 48 గంటల బంద్ విజయవంతం కోసం జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నాయకులు వినూత్న కార్యక్రమంలో చేపట్టారు. శనివారం నగరంలో పర్యటించి ప్రచారం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల, విద్యా రంగసమస్యలను పరిష్కరించాలని చేపట్టిన 48 గంటల బంద్‌కు ప్రవేటు కాలేజీల యజమానులు సైతం మద్దతు ప్రకటించిన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఓయూ అధ్యక్షులు కె.స్వాతి, ప్రధాన కార్యదర్శి రుక్మత్ పాషా, ఉపాధ్యక్షులు సతీష్, నాయకులు బాలకృష్ణ, భగత్, ప్రమోద్, విజయ్, తరుణ్ పాల్గొన్నారు.

హమాలీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు



ప్రారంభోత్సవంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌బాబు

కంటోన్మెంట్: మార్కెట్ యార్డులో పనిచేసే హమాలీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌బాబు తెలిపారు. అమీర్‌పేటలోని మెడిస్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరాలు విరివిగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఎండీ డాక్టర్ వెంకటేశ్వర్లు, సీఈఓ రాజా, డాక్టర్లు సంతోష్, మాధురి పాల్గొన్నారు.

పీవీకి బీజేపీ నేతల ఘన నివాళి



పీవీ నరసింహారావుకు నివాళులర్పిస్తున్న రవిప్రసాద్ గౌడ్

బౌద్ధనగర్: మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు 104వ జయంతిని పురస్కరించుకొని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ నెక్లెస్ రోడ్ వద్దనున్న పీవీ ఘాట్‌లో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్.మహేష్, అల్లాడి గంగాధర్. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.